క్లుప్తంగా

నియోజకవర్గానికి రూ.5 కోట్లు మంజూరు

అశ్వారావుపేటరూరల్, దమ్మపేట: తాగునీరు, ఇతర అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అశ్వారావుపేట నియోజకవర్గానికి రూ.5కోట్ల నిధులు మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన సీఎం కేసీఆర్‌ను కలిసి పలు సమస్యలు వివరించగా.. స్పందించిన సీఎం గ్రామాల్లో అవసరమైన చోట బోర్లు, మోటార్లు, చేతి పంపుల నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జీవో నంబరు 245 విడుదలైనట్లు వెల్లడించారు.

ట్యాబులు పంపిణీ

చంద్రుగొండ: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మంజూరైన ట్యాబులను మండల విద్యాశాఖాధికారి సత్తెనపల్లి సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులకు శనివారం పంపిణీ చేశారు. చంద్రుగొండలోని విద్యావనరుల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలకు సంబంధించిన రిపోర్ట్స్ ఆన్‌లైన్ ప్రక్రియ ఇకపై ట్యాబుల ద్వారా చేసుకోవాలన్నారు. వీటి రక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్‌కుమార్, సునిత, ప్రవీణ్, రమేష్, లోకేష్, సేవ్యా పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కహోల్ అనాథాశ్రమంలోని విద్యార్థులకు ఖమ్మం జాగృతి హాస్పిటల్ మేనేజర్ తోట కృష్ణ సహకారంలో భద్రాచలం మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయరామ్, శివరామ్, ప్రసాద్, ఆశ్రమ నిర్వాకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

భట్టికి సంఘీభావం



భట్టితో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గా ప్రసాద్

భద్రాచలం: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న 'పీపుల్స్ మార్చ్'పాదయాత్రలో భద్రాచలం కాంగ్రెస్ నాయకులు పాల్గొని భట్టికు సంఘీభావం తెలిపారు. టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గా ప్రసాద్‌లు ఆయనను కలిసి 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భట్టీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు.

దోమతెరల పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని బుగ్గ గ్రామపంచాయతీలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన బుడుగులలో 40 కుటుంబాల వారికి దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దోమతెరలను ట్రస్ట్ చైర్మన్ గంటా రాధ పంపిణీ చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామస్తులు సీజనల్ వ్యాధుల రాకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు శూన్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో గోదావరి వరదల వల్ల గత ఏడాది జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే అధికారులు అధికారులు నష్ట నివారణ చర్యలు చర్యలు చేయట్టాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఏఎమ్‌సీ కాలనీలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వర్షకాల నేపథ్యంలో గత ఏడాది వరదల సమయంలో భద్రాచలంలో పర్యటించి వరదల నుంచి భద్రాచలాన్ని కాపాడేందుకు సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు వెంటనే మంజూరు చేసి రక్షణ చర్యలు ప్రారంభిచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దాసరి శాంతయ్య, కనకరాజు, బర్ల రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరించాలి..

దుమ్ముగూడెం: పైదిగూడెం భద్రాచలం ఆర్టీసీ సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవా ఆర్టీసీ డీఎంను శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కాలేజీలు పునఃప్రారంభించి సుమారు 12 రోజులు కావస్తున్నప్పటికీ బస్సు సర్వీసును ప్రారంభించలేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గౌరారం, పైదిగూడెం గ్రామాల నుంచి విద్యార్థులు దుమ్ముగూడెం, నర్సాపురం, భద్రాచలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సే శరణ్యమని, బస్సు సర్వీస్ ప్రారంభం గాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరారు.

చినుకు రాలింది.. విత్తు పడింది..

- మూడు రోజులుగా మోస్తరు వర్షాలు
- దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు
- పలు చోట్ల పత్తి, మక్కల విత్తనాలు నాటిన వైనం



గుండాల: దుక్కులు చేసి విత్తనాలు నాటుతున్న కూలీలు



అశ్వాపురం తుమ్మలచెరువులో పత్తి విత్తనాలకు దుక్కి దున్నుతున్న దృశ్యం

గుండాల: ఈ ఏడాది వానాకాలం కాస్త ఆలస్యమైనప్పటికీ ఎట్టకేలకు వాన పడింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. గత మూడు రోజులుగా ఓ మోస్తరుగా వానలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మరో పక్క ఇదివరకే దుక్కులు చేసిన చేలల్లో పత్తి మొక్కజొన్న విత్తనాలు నాటుతున్నారు. ఈ ఏడాది సుమారు 20వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయనున్నారు.

అశ్వాపురం: అల్పపీడనం, నైరుతి రుతుపవనాల రాకతో వరుణుడు కరుణించాడు. వాతావరణం చల్లబడి జల్లులు కురుస్తుండటంతో రైతులు పొలాల బాట పట్టారు. వరిసాగుకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. పత్తి రైతులు పత్తి విత్తనాలు పెడుతున్నారు. శనివారం మండల వ్యాప్తంగా రైతులు పత్తి విత్తనాలు వేశారు.

పొంగులేటి వర్గీయుల సమావేశం

దమ్మపేట: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని దమ్మపేట గ్రామంలో పొంగులేటి ప్రధాన అనుచరుడు జారే ఆదినారాయణ అధ్యక్షతన ముఖ్య అనుచరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక దాదాపుగా ఖరారు అయిందని అన్నారు. ఇందునిమిత్తం ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో రాహుల్ గాంధీతో పొంగులేటి భేటీ కానున్నారని తెలిపారు. పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరే నిమిత్తం జూలై మొదటి వారంలో ఖమ్మం పట్టణ ప్రాంతంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారని తెలిపారు. మండంలోని ప్రతి గ్రామం నుంచి పొంగులేటి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులను భారీగా సభకు తరలించేలా చూడాలని అనుచరులకు దిశానిర్దేశం చేశారు. చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, నాయుడు శ్రీను, రావు రవిశంకర్, చామర్తి గోపిశాస్త్రి, సాయిల నర్సీ, చక్రాల మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై పోరుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జానంపేట గ్రామంలో పొంగులేటి యువసేన, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పినపాక నియోజకవర్గంలో ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేస్తానని, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోట్లపల్లి ఉపసర్పంచ్ కస్తూరి లింగయ్య, పేరం వెంకటేశ్వరరావు, ఉడుముల రవి తదితరుల పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఖమ్మం పట్టణంలో జూలై మొదటి వారంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు భద్రాచలం డివిజన్ నుంచి భారీగా జన సమీకరణ చేయాలని భద్రాచలం నియోజకవర్గ నాయకుడు డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని పొంగులేటి, తెల్లం క్యాంపు కార్యాలంలో ఆయన ముఖ్య అనుచరులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో రమాకాంత్, రాజీవ్, సుధాకర్, రహీం, విజయ్, వెంకట్, భాను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ స్క్రీనింగ్‌పై శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలపై ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్‌ను మండలంలో మొదట స్కూల్ విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 40 సంవత్సరాలలోపు వయసున్న అందరూ స్క్రీనింగ్ టెస్టుకు అర్హులని తెలిపారు. మండలంలోని విద్యార్థులు, 40 సంవత్సరాల వయస్సు కలిగి అందరూ ఈ స్క్రీనింగ్ చేసుకోవాలని కోరారు. మండలంలో 27వ తారీకు నుంచి సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూలమ్మ, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, హెచ్‌వీ శారారాణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

చర్ల: మండలంలోని కలివేరు గ్రామ పంచాయితీలో నెలకొన్న తాగునీటి సమస్యను నరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. విషయం తెలుకున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ రాము ధర్నా ప్రాంతానికి చేరుకుని వారితో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పనులు కొనసాగుతున్నాయని, నాలుగు రోజుల్లో పనులు పూర్తవుతాయని వివరించారు. ఆ తరువాత నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్, నాయకులు బొర్ర సమ్మక్క, కల్లూరి భవాని, సప్కా నగేష్, అలవాల విజయలక్ష్మి, పొడియం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

జాతాను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకురాళ్లు

చర్ల: ఐసీడీఎస్ పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీపుజాతాను విజయవంతం చేయాలని సీఐటీయూ కన్వీనర్ రాధాకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చర్ల ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పాలెం నాగమణి, ఎం.విజయశీల పిలుపునిచ్చారు. శనివారం జీపు జాతాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను చర్లలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని, ఈ తీరును నిరసిస్తూ చేపట్టిన జీపు జాతా రేపు చర్ల మండలానికి చేరుకోనుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కమల మనోహరి, విజయలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ జాతాను విజయవంతం చేయాల్సిందిగా.. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి కోరారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ కమిటీ సమావేశం శనివారం లలిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బ్రహ్మాచారి మాట్లాడుతూ.. ఐసీడీఎస్ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ జాతా రేపు ఉదయం 9 గంటలకు భద్రాచలం రానుందని తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో భారీ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ భద్రాచల పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, శ్రామిక మహిళా పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక, సంఘం టౌన్ నాయకులు ఎన్. నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

ఓటర్ లిస్ట్‌లో పేరును పరిశీలించుకోవాలి

బూర్గంపాడు: ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటరు లిస్ట్‌లో తమ పేరును సరిచేసుకోవాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి సూచించారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రతి ఓటరు తమ దగ్గరలోని బూత్ లెవన్ ఆఫీసర్ వద్ద పరిశీలించుకోవాలని తెలిపారు. లేకుంటే గూగుల్ ప్లేస్టోర్‌లో ఓటర్ హెల్ప్‌లైన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటర్ ఐడీతో ఓటును పరిశీలించుకోవాలని తెలిపారు. ఓటర్ లిస్ట్‌లో ఓటు లేనట్లయితే పాస్‌ఫోర్ట్ సైజు ఫోటో, ఆధార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్‌తో ఫామ్-06 నింపి స్థానిక బీఎల్‌ఓకు గాని, తహసీల్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

27 నుంచి సికిల్‌సెల్ పరీక్షలు

చంద్రుగొండ: ఈ నెల 27 నుంచి పాఠశాలల్లో సికిల్‌సెల్ వ్యాధి బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కనకం తనుజ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 0 నుంచి 40 సంవత్సరాల వయసున్న వారిలో రక్తహీనత గుర్తించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు తొలుత పాఠశాలలు, హాస్టళ్లల్లో సికిల్‌సెల్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాపంథాలో చేరిక

చర్ల: మండలంలోని కొయ్యూరు గ్రామపంచాయతీ రాజయ్యనగర్‌కు చెందిన పలు ఆదివాసీ కుటుంబాలు శనివారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీలో చేరాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ వివిధ పార్టీల నుంచి ప్రజాపంథా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో నాయకులు రేగా ఆంద్రెయ్య, మునిగెల శివ, జముల, సరేంద్ర, బాయమ్మ, భద్రమ్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో సన్మానం

అశ్వారావుపేటరూరల్: మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను శనివారం స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి తొలిసారిగా చీఫ్ ఇంజనీర్ రాగా, ఈ సందర్భంగా ఎంపీపీ ఆయనను శాలువా కప్పి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఈఈ తిరుమలేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట నరసింహం పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తాటి నాగులగుంపు గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో వితరణ అందించారు. గ్రామానికి చెందిన కుంజా నాగమ్మ పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన సంగతి తెలిసిందే. దాంతో బాధితురాలికి పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, బియ్యం, దుప్పట్లు, కూరగాయాలు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డేగల రాము, ఇస్లావత్ వినోద్, మల్లం రామకృష్ణ, బద్దిరెడ్డి రాజేష్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలగానే కొనసాగించాలి

గుండాల: మండలంలోని కాచనపల్లిలో క్రీడా పాఠశాలగా మార్చిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తిరిగి ఆశ్రమ పాఠశాలగానే కొనాగించాలని ఎస్ఎమ్‌సీ మాజీ చైర్మన్ చాట్ల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఆశ్రమ పాఠశాలగా ఉన్న దానిని క్రీడా పాఠశాలగా మార్చడం వల్ల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

దరఖాస్తుల పరిశీలన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని అందించేందుకు స్వీకరించిన దరఖాస్తులను శనివారం ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. ఇటీవలె లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా ఈ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా.. ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఎంపీడీఓ విచారణ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశీలించిన దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యేక నమూనాలో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు హరికృష్ణ, శ్రీరామ్మూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.



లబ్ధిదారుల ఇళ్ల వద్ద దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కల్తీలేని విత్తనాలు అందించాలి

అశ్వారావుపేటరూరల్: రైతులకు ప్రభుత్వం కల్తీ లేని విత్తనాలు, ఎరువులను అందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. మండలంలోని దురదపాడు గ్రామంలో శనివారం ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు రైతు, కూలీల వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను తక్షణమే మార్చుకోకపోతే రైతులు, కూలీలు కలిసి పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ఆరంభమైందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతులు నష్టపోకుండా ఉండేందుకు కల్తీ లేని విత్తనాలు, ఎరువులు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆ సంఘం మండల నూతన రైతు కమిటీ అధ్యక్షుడిగా పండా ముత్యాలు, కార్యదర్శిగా కంగాల కన్నయ్య, కార్మిక సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శిగా కంగాల వెంకటేష్, ధర్ముల శ్రీరాములతోపాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కుంజా లక్ష్మి, కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, కుంజా అర్జున్, శారద, కొమరం లక్ష్మి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ పనులు శనివారం ప్రారంభించారు. ఈ నెల 21న 'డ్రెయినేజీ నిర్మాణం ఇంకెప్పుడు'అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. కాగా, పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



మొండికుంటలో ప్రారంభమైన డ్రెయినేజీ నిర్మాణ పనులు

భౌతిక దాడి కేసు నమోదు

దమ్మపేట: భూవివాదం కారణంగా వ్యక్తిపై భౌతిక దాడికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని దమ్మపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన దారా నాగేశ్వరరావు, దారా శ్రీనివాసరావులకు గత కొంతకాలంగా గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రం విషయంలో భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన దారా నాగేశ్వరరావును, దారా శ్రీనివాసరావు అసభ్య పదజాలంతో దూషిస్తూ, కర్రతో భౌతిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

బూర్గంపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసునమోదైంది. బూర్గంపాడుకు చెందిన చందర్‌రావు అనే వ్యక్తి శనివారం బూర్గంపాడు సబ్‌స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిని బెదిరించి దుర్భాషలాడటంతో పాటుగా విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ ఉమారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు: మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. బుడ్డగూడెం గ్రామసమీపంలోని కిన్నెరసాని నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని శనివారం సాయంత్రం ఏఎస్సై సత్యనారాయణ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవటంతో లారీని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

జగన్నాథుడికి పూజలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గుండిచాఘర్ మందిరంలో జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రదేవిలకు భక్తులు నిత్య పూజలు, భజనలు, కీర్తనలు చేస్తున్నారు. ఐదో రోజు శనివారం హెరా పంచమి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో హెరా పంచమి ప్రత్యేకమైన కార్యక్రమం. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హెరా పంచమి కార్యక్రమం తిలకించి పూజలు చేశారు.

రోడ్డుపై గ్రావెల్ పోత

గుండాల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలుస్తుండడంతో శనివారం పంచాయతీ అధికారులు గ్రావెల్ పోసి చదును చేశారు. గత నెలలో వారం రోజుల పాటు కురిసిన వర్షాలతో రోడ్డుపై నీలుస్తుండడంతో అదే నెల 5వ తేదీన సాక్షి దినపత్రిలో 'రోడ్డుపై నీరు...స్థానికుల తిప్పలు' అనే శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ కోరం సీతారాములు, కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రావెల్ పోసి చదును చేశారు.

సాక్షి ఎఫెక్ట్..




రోడ్డుపై గ్రావెల్ పోసి చదును చేసిన దృశ్యం

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

భద్రాచలంటౌన్: తెలంగాణాలో బీజేపీ నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన వస్తుందని రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. భద్రాచలం పట్టణంలో బీజేపీ ఇంటింటి ప్రచారం మూడో రోజు శనివారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎర్రం రాజు బెహరా, నాగబాబు, రామ్మోహన్ రావు, క్రాంతికుమార్, వెంకన్న, శ్రీనివాస్, సుదర్శన్, ముక్తేశ్వరరావు, కేశవ్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: దేశంలో ప్రధాని మోదీ పాలనపై బీజేపీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో శనివారం మండల, మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లో కరపత్రాలతో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ..బిజెపి విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు జాడి దేవేంద్ర వరప్రసాద్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చిర్రా సరస్వతి, నియోజకవర్గ కన్వీనర్ పున్నం బిక్షపతి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్, నాయకులు



భద్రాచలంటౌన్: పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కిషోర్, బిక్షపతి, రామకృష్ణంరాజు, నాగేశ్వు, ఎం.వెంకటేశ్వరరావు, భూక్యా ప్రసాద్, రవికుమార్, మురళీమోహన్‌రాజు, ప్రభాకర్, పట్టణ నాయకులు లింగంపల్లి రమేష్, భూక్యా ప్రసాద్, ఎర్రోజు నాగమణి, బీర రమేష్, రేణుక, ప్రశాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: కేంద్రంలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఆ పార్టీ నాయకులు మండలంలోని పర్ణశాల గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడపగడపకూ తిరుగుతూ కరపత్రాలు, స్టిక్కర్లను అందజేశారు. ప్రతి వ్యక్తీ కేంద్ర ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్, మండల ఉపాధ్యక్షుడు అపకా శ్రీనివాస్, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ కాగితాల త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.